తెలిసి
ఒకరికి
తెలియకుండా
మరొకరికి
అంకితమైన
ఆమె జీవితం?

కె.బి.యస్
కుమార్
కథ

# ప్రాప్తమున్న తీరానికి

ఆమె కన్నీటిని 'సిరా'గా ఉపయోగించి వుంటే ఆ సిరాతో ఒక మహత్తర కావ్యాన్ని రచించి వుండేవాడిని...!!

* * *

చెప్పులు వేసుకుని బైటికి వెళ్ళబోతున్న హృదయ ఎదురొస్తున్న అతన్ని చూసి టక్కున ఆగిపోయింది.

ఆమె మొహంలో రంగులు మారాయి. నిశ్శబ్ద తటాకంలా వున్న ఆమె హృదయం రాయి కురిసినట్టు ఎన్నో చీకటి వలయాలని సృష్టించుకుని అల్లకల్లోలమైంది.

అతనివేవీ గమనించలేదు. "హృదయా!!" అన్నాడు ఆత్రంగా.

ఆ ఆత్రంలో ఆనందం వుంది.

ఆ పిలుపు ఆమెని కదిలించలేదు. మనసుని మళ్ళీ నిశ్శబ్ద తటాకంగా మార్చుకునే ప్రయత్నంలో 'ఎవరు మీరు?' అందామె క్లుప్తంగా.

ఉలిక్కిపడ్డాడతను. నాలుగు క్షణాల తర్వాత అతడు నెమ్మదిగా ఆమెని సమీపించాడు. సంకోచిస్తూనే మృదువుగా ఆమె చేతిని అందుకున్నాడు.

ఆమె అభ్యంతరం చెప్పలేదు.

"హృదయా! ప్లీజ్... ఒక్క పదినిమిషాలు... నా కోసం కేటాయించగలవా?" అతని అర్థింపులో స్పష్టమైన సిన్సియారిటీ వుంది.

"సారీ... నా ఆఫీసుకి టైమైంది. ఆలస్యమైతే బాస్ కోపగించుకుంటారు..."

ఆమె చేతులు మృదువుగా అతని చేతిని విడిపించుకున్నాయి. ఆమె పాదాలు



బరువుగా బైటికి పడిచాయి.

* * *

ఠంగ్‌మంటూ అరగంట కొట్టింది గోడకున్న పాత గడియారం. పెండ్యులంలా ఊగుతోంది హృదయ మెడలో మాంగల్యం.

అప్పుడప్పుడూ ఆమె కన్నుల్లోంచి ఒక్కో చినుకూ రాలి పడుతోంది.

అలా ఎంతసేపు గడచిందో తెలీదు.

"అమ్మా అయ్యగారు పిలుస్తున్నారు..." ప్యూను వచ్చి చెప్పాడు.

ఆమె కదిలింది. కళ్ళు తుడుచుకునే ప్రయత్నం చెయ్యలేదు.

"ఎందుకు అలా వున్నావ్?' ప్రశ్నించాడు యజమాని.

"మనసు బాగోలేదు..." ఒక నిమిషం తర్వాత జవాబిచ్చిందామె.

"మరి ఫోన్ చేసి రెస్టు తీసుకోలేకపోయావా?"

"ఇవాళ ఇంటికన్నా ఇక్కడే ప్రశాంతంగా లభిస్తుందనిపించింది..."

అతను మాట్లాడలేదు. నెమ్మదిగా కుర్చీలోంచి లేచాడు. ఆమెకేసి నడిచాడు. ఆమె కూచున్న కుర్చీ చేతిమీద కూచున్నాడు. ఆమె చుబుకం పట్టుకొని పైకెత్తాడు. వర్షిస్తోన్న ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ... 'తప్పుకదూ!' అన్నాడు.

అంతే...

బావురుమంటూ బల్లిలా అతన్ని అతుక్కుపోయింది హృదయ!

సరిగ్గా అదే సమయంలో...

పార్కులో కూచుని గతం గురించి ఆలోచిస్తున్నాడు భరత్.

* * *

"నాకెందుకో భయంగా వుంది హృదయా!"

"భయమా? ఎందుకు?"

"నువ్వు నాకు దక్కనేమోనని!!"

"పేరు భరతుడు. మనిషి మాత్రం పిరికివాడు!!"

"హృదయా...!!?"

"మనసిచ్చినప్పుడూ పుచ్చుకున్నపుడూ ఎడారిలో గులాబీలని, కన్నీటిలో అమృతాన్నీ చూసినప్పుడూ భయాల సంగతి ఊహించలేదా మహాశయా!? ఇంతకీ తమ భయానికి కారణం?"

"ఒక్కడే కొడుకుని కదా, నేనేం చేసినా మా నాన్న కాదననుకున్నాను. అగ్నిలా విజృంభించాడు. తల్లిలేని కొడుకుని కూడా చూడకుండా తన్ని తన్ని తరిమేస్తానని బెదిరించాడు. ఏం చెయ్యటానికీ పాలుబోకుండా ఉంది"

"ఓ పని చెయ్యి. వెరీ సింపుల్..."

"ఏమిటది?"

"నన్ను మర్చిపో..."

"వాట్ నాన్సెన్స్ యు ఆర్ టాకింగ్? ఇంపాజిబుల్!!"

"ఒక్క ఒరలో రెండు కత్తులిమడవు భరత్! పెళ్ళి నూరేళ్ళ పంట అయితే ప్రేమ వెయ్యేళ్ళ పంట!! నా కోసం కలిమిని, కన్నతండ్రిని వదులుకోమని నేను చెప్పలేను. మనం ఇంకా 'ప్రే ఫర్ ప్రేమ' దశలోనే వున్నాం కాబట్టి..." కన్నీరు పార గళానికి సైతం అడ్డుపడటంతో హృదయ అంతటితో ఆగిపోయింది.

ఇబ్బందిగా కదిలాడు భరత్. మ్లాన వదనంతో నేలచూపులు చూస్తూ గడ్డి పరకల్ని తెంచుతున్న హృదయ మొహాన్ని దోసిలితో అందుకొని తనకేసి తిప్పుకున్నాడు.

"ఇలా నా మొహంలోకి సూటిగా చూసి చెప్పు. మనమింకా 'ప్రే ఫర్ ప్రేమ'

దశలోనే ఉన్నామా?"

"....."


"ఊహించని పరిణామం ఎదురుకావడంవల్ల కాస్త ఖంగుతిని ఏమీ తోచని పరిస్థితుల్లో అలా మాట్లాడాను గాని పిరికితనం వల్ల కాదు హృదయా! నీ కోసం ఈ ప్రపంచాన్నే ఎదిరించటానికి సిద్ధంగా ఉన్నాను. నాకు నువ్వు, నీకు నేను. చాలు. మనకెవ్వరితోనూ పన్లేదు. కలిమినే కాదు. కన్నతండ్రినే కాదు. ఎవర్నైనా ఎదిరిస్తాను..." ఆమె హృదయ కడలిలో ప్రశాంతతని నెలకొల్పే ప్రయత్నంలో భాగంగా ఆ మాటలన్నాడు భరత్.

ఆ తర్వాత నలభై రోజుల్లోగా వాళ్ళ వివాహం రిజిస్ట్రార్ సముఖంలో సింపుల్‌గా జరిగిపోయింది. భార్యని తీసుకొని ఇంటికి వెళ్ళి కనీసం తండ్రికి చూపించే ప్రయత్నం చెయ్యలేదు భరత్. ఆదరణ లభించ దన్న ఊహతో ఇంటికి రావడం లేదని, భవిష్యత్తులో మరెప్పుడూ తన ఇంటి గుమ్మం తొక్కననీ తండ్రికి కార్డుముక్క రాసి పారేశాడు భరత్.

దంపతులైన ప్రేమికులే కాదు. ఎవరైనా సరే— ఎదురెదురుగా కూచుంటే కడుపునిండదని అతనికి వెంటనే అర్థమైపోయింది. ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. ఫలించలేదు. సర్టిఫికెట్లు వగైరాలన్నీ ఇంట్లోనే వుండిపోయాయి. వెడదామంటే గుమ్మం తొక్కనని ఉత్తరం రాశాడాయె.

చేసేది లేక నౌకరుద్వారా వాటిని తెప్పించుకునే ప్రయత్నం చేశాడు భరత్. కాని కార్డు అందినవాడు వాళ్ళ నాన్న తనకి సంబంధించిన దుస్తులు, పుస్తకాలు, ఫోటోలతో సహా కాల్చి పారేశాడని తెలిసి ఖిన్నుడయ్యాడు.

చదివిన చదువంతా వృథా అయిపోయింది. డిగ్రీ పాసయ్యానని చెబితే సర్టిఫికెట్లు చూపమంటున్నారు. చెప్పులు కాదు కాళ్ళే అరిగేలా తిరిగి ఉద్యోగం లభించే



సూచనలేవీ కన్పించలేదు.

మూటలుమోసే పనికి సైతం సిద్ధమయ్యాడు. కాని అతని మొహంలోంచి వెలువడుతున్న విద్యాగంధాన్ని, వర్చస్సుని చూసి కూలీపని ఇవ్వటానికి మేస్త్రీలు వెనకాడారు.

ఒక్కసారిగా ఏడుపు ముంచుకొచ్చింది భరత్ కి.

* * *

దేవుని పటంకేసి చూస్తూ తదేకంగా ఆలోచిస్తోంది హృదయ.

భరత్ ని పెళ్ళాడి తను తప్పుచేసిందా? ప్రేమలో తాము విజయాన్ని చవిచూశారుగాని జీవితంలో ప్రతి నిముషము ఎదురుదెబ్బలు తగుల్తున్నాయెందుకని?

ప్రేమించటమే తాము చేసిన నేరమా??

లోకంలో విద్యాధికులే కాదు. ఏమీరాని వారూ ఉన్నారు. అందరూ ఏదో ఒక విధంగా జీవనం సాగిస్తున్నారు. మరి తమ రాత ఇలా ఎందుకు తయారైంది?

ఈ ప్రేమలూ ప్రతిఘటనలూ కథల్లోనూ చరిత్రల్లోనే! జీవితంలో ఎంత చేదుగావున్నాయి?

మొత్తమ్మీద తను దురదృష్టవంతురాలు. భరత్ కి అర్ధాంగి అయి, అతని జీవితంలోని ఆనందాన్ని కూడా హరించివేసింది.

'భగవాన్... నన్ను క్షమించు... మాకోదారి చూపించు.' మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి ప్రార్థించింది హృదయ.

స్పర్శ తగిలేసరికి ఉలిక్కిపడి కనులు తెర్చింది. ఎదురుగా భరత్.

"మన కష్టాలు గట్టెక్కబోతున్నాయి హృదయా!!"

"ఉద్యోగం దొరికిందా?"

"త్వరగా తయారవు. బైటికి వెడదాం..."

ఎక్కడికని అడగలేదు హృదయ.

పది నిమిషాల్లో వాళ్ళిద్దరూ రోడ్డుమీద ఉన్నారు.

గత రెండ్రోజుల్నుండీ పొయ్యిలో పిల్లి లేవకపోవడంతో కళ్ళు బైర్లుకమ్ముతున్నాయి. కాళ్ళు లాగుతున్నాయి. బైటపడితే భరత్ బావురుమంటాడని పళ్ళ బిగువున సహిస్తోంది.

భరత్ పరిస్థితి కూడా అలాగే ఉంది. తను ముందుగా బైట పడితే హృదయ గుండె బద్దలవుతుందని ఓర్చుకున్నాడు. మౌనంగా ఉంటే ఆకలి బాధ అధికమవుతుందని దారిలో విషయం అతనే చెప్పాడు.

ఏదో కంపెనీ తాలూకు ఆఫీసు అది. సర్టిఫికెట్లు లేకపోయినా ఉద్యోగం ఇవ్వటానికి సమ్మతించారు. అయితే నెలకి జీతం రెండువందలు మాత్రమే! భార్యకూడా విద్యావంతురాలు అయిన పక్షంలో ఆమెకీ ఇస్తారట...

"నన్ను క్షమించు హృదయా! సంపాదించి కుటుంబాన్ని పోషించాల్సిన స్థానంలో వుంటూ కూడా నిన్ను... నిన్ను ఉద్యోగం చెయ్యనివ్వను అంటూ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోతున్నాను... నన్ను... నన్ను..."

మృదువుగా అతని చేతిని నొక్కింది హృదయ .అందులో ఎన్నో అర్థాలున్నాయి.

మరికొంత దూరం నడచి వాళ్ళు గెస్ట్‌హవుస్ లాంటి బంగళా చేరుకున్నారు. బెల్ మ్రోగించాడు భరత్ నిమిషం తర్వాత తెర్చుకుంది.

లోపలికెళ్ళారు.

ఖరీదైన కార్పెట్‌పై సోఫాలున్నాయి. ఓ దాంట్లో ఒదిగి కూర్చున్నారు.

పది నిమిషాలు గడిచాక ఇద్దరు నడి వయస్కులు వచ్చారు.

ఇంటర్‌వ్యూ ప్రారంభమైంది.

అది ఇంటర్‌వ్యూహం అని హృదయకి పది నిమిషాల తర్వాత తెలిసింది.

ఇంటర్‌వ్యూలో భాగంగా అతడు పక్కగది లోకి వెళ్ళాడు.

"పడక గదిలోకి వెళ్దామా? ఇక్కడ కానిద్దామా??" ఇద్దర్లో ఒకడు అడిగాడు.

తెల్లబోయింది హృదయ.

ఈసారి ఆశ్చర్యపోవడం వాళ్ళవంతైంది. ముందుగా ఒకరి మొహాలు ఒకరు చూసుకుని ఆనక ఇద్దరూ కల్పి ఆమె మొహంలోకి చూశారు.

"భరత్ నీకు పూర్తిగా చెప్పలేదూ?!"

"చెప్పారు. అవకాశం ఉంటే నాక్కూడా ఉద్యోగం..."

"అలా చెప్పాడా పాపం?... ఎలా చెబితేనేంలే... చూడు పాపా!! మేం మొత్తం ఆరుగురుం ఉన్నాం. ఈ కంపెనీ భాగస్వాములం నా అందరికీ నువ్వు భాగస్వామివివి కావాలి. రోజుకొక్కర్ని అలరిస్తూ ఉండాలి. ఇది నీ ఉద్యోగం. అప్పుడే నీమొగుడికి ఉద్యోగం. ప్రతి ఆదివారం నీకు విశ్రాంతి. నీ మొగుడికి శలవు. ఆరోజున మీరిద్దరూ కల్పి పండగ చేసుకుంటే మాకేం అభ్యంతరం లేదు. ఈ ప్రాతిపదికన పై ఒప్పందం కుదుర్చుకునే పక్షంలో మాత్రమే నిన్నిక్కడికి తీసుకురమ్మని చెప్పాం..."

వాళ్ళు ఇంకా ఏమో చెబుతున్నారు. హృదయకేం వినిపించటం లేదు. ఆమె చెవుల్లో ఎవ్వరో వికృతనాదం ఆలపిస్తున్నారు. హృదయంలో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి.

## లంచ్



"నాతో కలిసి లంచ్ చేయటానికి మీకేమైనా అభ్యంతరమా?" అడిగాడు శ్రీకాంత్.

"అబ్బే... లేదండీ!" మర్యాద పూర్వకంగా అన్నాడు రేవంత్.

"అయితే మీ ఇంటికి ఫోన్ చేసి — మీతో పాటు నేమా లంచ్‌కు వస్తున్నానని చెప్పండి!" అన్నాడు శ్రీకాంత్.

జోకర్. (హైదరాబాద్)

కళ్ళముందు మిరుమిట్లు గొలుపుతూ శూన్యం!! అందులో పోల్చుకోలేని రాక్షసులు ఎందరో ఉన్నారు. అందరూ వికటాట్టహాసం చేస్తూ కుప్పిగంతులు వేస్తున్నారు. మరింత భయంకరంగా ఉన్న మరో రాక్షసుడు వారికి వాయకత్వం వ హిస్తున్నాడు.

వాళ్లే మాత్రం పోల్చుకోగలిగింది హృదయ.

ఆ సమయంలో రెండేరెండు నీటి బిందువులు ఆమె కళ్ళనుండి రాలి ఆ ఇద్దర్లో ఒకడి చేతిపై పడి 'చుయ్' మని శబ్దం చేస్తూ ఉడికి, మరు నిమిషంలోనే ఆవిరై పోయాయి.

ఆమె ముష్టిఘాతం వని చెయ్యడం ప్రారంభించిన క్షణంలో ఆ ఇద్దరికీ మరో నలుగురు తోడై ఆరు తోడేళ్ళుగా ఆమెని చుట్టుముట్టారు.

ప్రతిఘటించే శక్తి ఆమెలో లేదు.

* * *

భరత్ చేతిలో ఆర్డరు కాగితం రెపరెప లాడుతోంది. హృదయ మొహం కేసి చూళ్ళేకపోతున్నాడతను. అతని చేతులు కంపిస్తున్నాయి. పెదవులు కంపిస్తున్నాయి. హృదయం కంపిస్తోంది.

నేలపై అస్తవ్యస్తంగా పడివుంది హృదయ. ఆమె కళ్ళు తెర్చుకునే ఉన్నాయి. అందులోంచి అప్పుడప్పుడూ కురుస్తోన్న నిమకుని బట్టి ఆమె ఇంకా బ్రతికే ఉన్నదని అనుకోవాల్సి వస్తోంది.

ఆమె కళ్ళు గోడకున్న దేవుడి ఫోటోని ఐదేకంగా చూస్తున్నాయి. ఆ చూపుల్లో ఏ భావమూ లేదు.

ఆమె చూపుల్ని భరించే శక్తి తనకూ్కడా లేదన్నట్టుగా ఆ ఫోటో గోడపై గడియారంలోని పెండ్యులంలా ఊగుతోంది.

గాలి, వాన ఉధృతమైంది.

అతి కష్టమ్మీద లేచింది నెమ్మదిగా, చిరిగిన జాకెట్టుమీదుగా పయ్యెదని కప్పుకుంది. గోడకేసి నడిచింది. కొయ్యకి నాసిన చీర కప్పించింది. అందుకోబోయింది. మళ్ళా అంతలోనే ఆగిపోయింది. మళ్ళీ ఒకసారి దేవుడి ఫోటోకేసి చూసింది. ఈ సారి చూపుల్లో నిరసన భావం కదలాడింది. కొంగుని తలమీదుగా కప్పు కుంది. తల వంచుకుంది. వడివడిగా అడుగులు వేస్తూ తలవాకిలికేసి నడిచింది.

"హృదయా...!!" ఆర్తిగా పిలిచాడు భరత్.

ఆమె అతని కేసి చూడలేదు. మాట్లాడలేదు.అతని పిలుపుకి జవాబుగా ఒకే ఒక్క అక్షరం మాత్రం వెలువడింది ఆమె నోటివెంట.

"థూ..."

అతను మొహం తుడుచుకొని చూసేసరికి ఆమె అక్కడ లేదు.

* * *

వీధిలైట్లు అక్కడొకటే అక్కడొకటే మందంగా వెలుగుతున్నాయి. వర్షం కుండపోతగా కురుస్తోంది.

ఆమె నడుస్తూనే ఉంది.

బైటికొస్తే తరుస్తామని కాబోలు. కుక్కలు చాటునుండి మొరుగుతున్నాయి. ఆమె లక్ష్యపెట్టడం లేదు. బ్రతుకుమీద తీపి వున్నవాళ్ళకి భయాలు. ఆమెకెందుకు?

మూడురోజులుగా ఆహారం లేక వకవకలాడుతోన్న కడుపు అది. ఆరుమంది రాక్షసులు దారుణంగా ఆడుకోగా భగభగమండుతోన్న హృదయం అది. కట్టుకున్న భర్తే కాటుకు కారణంకాగా మిలమిల మెరుస్తోన్న నిర్ణయం అది. ఆ నిర్ణయం ఆమెకి— సిటీ పొలిమేరలు దాటేవరకూ నడిచే శక్తిని ప్రసాదించిందీ అంటే అందులో ఆశ్చర్యం లేదు.

భర్త లేదు.

బంధువుల్లేరు.

దేవుడు లేదు.

ఏమిటీ జీవితం?

ఎందుకీ జీవితం??

...చిత్రం!!! ఆమె కన్నుల వెంట ఒక్క కన్నీటి చినుకు కూడా రాలలేదు.

దూరంనుండి హెడ్‌లైట్లు వేసుకొని ఏదో వాహనం వస్తోంది.

ఒక్క నిమిషం. ఆ తర్వాత ఒక్క క్షణం. అంతే...

మరో జన్మంటూ ఉంటే...

అసలు మరో జన్మ అవసరమా తనకి??

...ఆలోచనలకి ఫుల్‌స్టాప్ పెట్టేసింది. అవకాశం జారిపోతుంది ఆలస్యం చేస్తే,

కారు సరిగ్గా దగ్గరికొచ్చేసరికి సమయానికి దూకుడుగా అడ్డం వెళ్ళింది.

కీచుమంటూ శబ్దం చేసింది కారు. ఆమెకి అరసెంటీమీటరు దూరంలో ఆగిపోయింది.

కారులోంచి దిగాడు డ్రయివ్ చేస్తూన్న భవానీ ప్రసాద్.

యాభయ్యేళ్ళుంటాయతనికి. అయినా దృఢంగా ఉన్నాడు. నున్నగా మెరుస్తున్న బట్టతల ఆయనకున్న జీవితానుభవాన్ని చాటి చెబుతుంది. రోడ్డు నూటిగా వుండటంతో ఆమెని దూరంనుండి చూసి, విషయం గ్రహించి బ్రేకుపై కాలువేసే వుంచాడతను.

"ఆత్మహత్య చేసుకోవడం కూడా రాకపోతే ఎలా అమ్మాయ్!" సరదాగా అంటూ ఆమెకేసి చూశాడతను.

అప్పటికే స్పృహ తప్పివుంది హృదయ.



## పాపం... పిల్లలు!

నేపాల్‌లో ప్రతిరోజూ కనీసం 175 మంది పిల్లలు డయేరియా వ్యాధితో చనిపోతున్నారు. దానికి కారణం, అక్కడి తల్లిదండ్రులు డయేరియాతో బాధపడుతున్న పిల్లలకు నీరు ఇస్తే అవి విషంగా మారతాయనే అపోహతో నీరు ఇవ్వకపోవటమే! ఆ దేశంలో సగటున పిల్లలకు ఏడాదిలో ఆరుసార్లు ఈ వ్యాధి వస్తుందట! ఆ దేశంలోని పల్లెటూళ్ళలో కూడా ఇప్పటిదాకా పరిశుభ్రమైన నీరు దొరికే పరిస్థితులు ఇంకా ఏర్పడలేదు! ఇలాంటి వ్యాధులకు అసలైన కారణం ఇదే! ఏదిఏమైతేనేం... పాపం... పిల్లలు ప్రాణాలుకోల్పోతున్నారు కదా!

జూపిటర్

అతనికి వెంటనే కర్తవ్యం స్ఫురించింది.

..మూడురోజులుగా ఆహారం లేకపోవడంతో నీరసంవల్ల స్పృహ తప్పటం జరిగిందని, మందో మాకో మింగే ప్రయత్నం చెయ్యలేదని తెలిశాక అతను స్థిమితపడ్డాడు. వెయ్యి రూపాయలకి చెక్కు రాసిచ్చి మూడురోజుల తర్వాత ప్రోగ్రెస్ చెప్పమన్నాడు.

మూడోరోజున కోలుకుంది హృదయ. భవానీ ప్రసాద్ స్వయంగా వచ్చి తీసుకెళ్ళాడు. గెస్ట్ హవుస్‌లో వుంచాడు. పది రోజుల్లో పూర్తిగా కోలుకుందామె.

ఆమె వివరాలడిగి 'అనాథ' అని తెలుసుకున్నాడు భవానీ ప్రసాద్. తన ఆఫీసులోనే ఉద్యోగం ఇచ్చాడు. ఆత్మహత్య ప్రయత్నం ఏనాడూ చెయ్యనని ఆమె వద్ద మాట తీసుకున్నాడు.

ప్రతి విషయంలోనూ నిక్కచ్చిగా వుంటూ మానవత్వం విషయంలో ఎంతో ఉదారత్వం కనబరచిన అతని పట్ల కృతజ్ఞతతో ఆమె హృదయం నిండిపోయింది.

ఏమిచ్చి ఆయన రుణం తీసుకోగలదు తను?

ఈ ప్రశ్నలు ఎన్నోసార్లు వేసుకుందామె. నెల తర్వాత ఓరోజు జవాబు స్ఫురించిందామెకి.

మరుక్షణం చిగురుటాకులా వణికిపోయింది.

స్థిమితంగా ఆలోచించిన మీదట ఆమెకి తప్పులేదనిపించింది.

ప్రేమ పేరుతో తనకూడా తనవాళ్ళందర్నీ వదిలి భరత్‌కి సొంతమైంది తను. ఫలితంగా ఏం లభించింది తనకు? అంతకంటే ఇద్దరూ కలిసి జీవితాన్ని అంతం చేసుకొనే నిర్ణయం అతను తీసుకొని వుంటే తను ఆనందంగా అంగీకరించి ఉండేది.

కాని అతను అలా చెయ్యలేదు. అతి దారుణమైన, అత్యంత నీచమైన నిర్ణయం తీసుకున్నాడు. కాని తనకు మాటమాత్రంగా నైనా తెలియపరచలేదు. తనని చీమునెత్తురువున్న మనిషిగా చూడకుండా బలిపశువుని చేసి బలిపీఠానికి అప్పగించాడు.

మరివాళ్ళో— ? అవసరాన్ని స్వార్థానికి చక్కగా వినియోగించుకున్నారు. దాదాపు అందరూ తన తండ్రి ఈడువారే! ఆ సమయంలో ఎవ్వరికీ తమ కూతురు గుర్తుకి రాలేదు. నరమాంస భక్షకులై తన మాంసాన్ని తలా కాస్త పంచుకున్నారు.

భవానీ ప్రసాద్!!

ఏ ఉద్దేశంతో తనని రక్షించాడు?

ఏ ఉద్దేశంతో తనకి ఆరోగ్యాన్ని ప్రసాదించాడు?

ఏ ఉద్దేశంతో తనకి ఆశ్రయమిచ్చాడు?

ఏ ఉద్దేశంతో తనకి ఉపాధి చూపాడు.?

ఇందులో స్వచ్ఛమైన మానవత్వం తప్ప మరేం లేదు.

అలాంటి వ్యక్తికి తనని తాను అర్పించుకుంటే ఏం?

ఈ విధంగానైనా అతని రుణం తీర్చుకోగలిగితే...

ఆ నిర్ణయం తీసుకునే ముందు ఆమెలో సంఘర్షణ చెలరేగింది. కాని ఆమె మనోనిబ్బరంగా దాన్ని భరించింది. చాలా

కొద్ది వ్యవధిలోనే ఆమె దాన్ని అణచివేసింది.

భవానీ ప్రసాద్ రాగానే మాటిగా విషయం తెల్పింది.

అతను విస్తుపోయాడు.

"క్షమించండి. నీచమైన స్త్రీగా నన్ను భావించకండి. ఇది కేవలం కృతజ్ఞతా భావం. అంతే..."

"కృతజ్ఞత ఇలాగే తెలియపర్చాల్సిన పన్లేదు హృదయా?!"

"నా దృష్టిలో ఇదే న్యాయం. దయచేసి కారణాలు, వివరాలు అడక్కండి..."

"నేనేనాడూ నీ గతం గూర్చి అడగలేదు"

"అందుకే మీరంటే నాకిష్టం..."

ఆలోచించుకోవడానికి అతనికి అయిదునిమిషాలు పట్టింది. ఆ తర్వాత అతడు నెమ్మదిగా ఆమెని సమీపించాడు. చేతులు సాచాడు.

ఆమె అతని కౌగిట్లో ఒదిగిపోయింది. కొండంత తృప్తితో.

* * *

"ఏమిటీ దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" భవానీ ప్రసాద్ కంఠస్వరంతో బాటు స్పర్శకూడా తగిలేసరికి ఆమె ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చింది.

"అబ్బే... ఏం లేదు..."


"గతం తాలూకు నీడ ఏదో పొకిసట్టుంది. ఉదయం నుండీ నీలో నువ్వు లేవు. పద– అలా వెళ్ళొద్దాం..."

ఆమె అభ్యంతరం చెప్పలేదు.

వాళ్ళిద్దరూ బయటికి నడిచారు. కారులో ఆమెని ఊరంతా తిప్పాడు భవానీ ప్రసాద్. అయిస్‌క్రీములు, బఠానీలు వగైరాలు కొనిచ్చాడు. ఏవేవో కథలు చెబుతూ నవ్వించాడు. ఇద్దరూ హోటల్లో భోజనం చేశారు.

"ఇలా ఎక్కడికి?" ప్రశ్నించింది హృదయ.

"మా ఇంటికి..."



"ప్లీజ్ వద్దు. నన్ను గెస్ట్‌హవుస్‌లోనే వుండనివ్వండి"

"గెస్టు స్థానం దాటి నువ్వు చాలాకాలమైంది. ఇన్నాళ్ళు నేను ఆలోచించకపోవడం నాదే తప్పు..."

"లోకులు..."

"లోకులు... నీకులేని లోకులు నాకెందుకు?"

హృదయ జవాబు చెప్పేలోగా బంగళా వచ్చేసింది.

పోర్టికోలో కారాపి ఆమె భుజంపై చెయ్యివేసి లోనికి నడిచాడు భవానీ ప్రసాద్. క్రింది పోర్షన్ చూపించి మేడమీదకి తీసికెళ్ళాడు.

"ఇక్కడ నీకు అడ్డుచెప్పే వాళ్ళెవ్వరూ లేరు. ఇల్లంతా చూస్తూండు. నేను స్నానం చేసి వస్తాను..." బుగ్గపై మతారంగా నిమిరి బాత్రూమ్‌లోకి వెళ్ళాడు భవానీ ప్రసాద్.

ఆసక్తిగా ఆయిల్ పెయింట్స్‌నీ గోడల్నీ చూడసాగింది హృదయ. అన్నీ చూశాక అతని బెడ్రూమ్‌లోకి ప్రవేశించింది.

టీపాయ్‌పైనున్న ఆల్బమ్ ఆమెని ఆకర్షించింది. కుర్చీలో కూచుని తిరగెయ్యసాగింది.

ఓ పేజీలోని ఫోటోని చూడగానే ఆమె ఉలిక్కిపడింది. తలపై పిడుగుల వర్షం కురుస్తున్నట్టు, కాళ్ళకింద భూమి రెండుగా చీలిపోతున్నట్టు,. తన తలనే వెయ్యి ప్రక్కలుగా ప్రబద్దలవుతున్నట్టు వికృతమైన అనుభూతి!

నునక బారుతోన్న కళ్ళని నులుముకుని మరోసారి ఆ ఫోటోకేసి చూసింది.

దాదాపు నాలుగేళ్ళ క్రితం తీయించుకున్న ఫోటో అది. అందులో భవానీ ప్రసాద్, ఆయన సతీమణిలతో బాటు వారి కుమారుడు కూడా ఉన్నాడు.

అతడు భరత్.

ఆమె హృదయం నీళ్ళలోంచి తీసి చేపలా గిలగిలా కొట్టుకోనారంభించింది. వెయ్యి రకాల వాయిద్యాల్ని లక్షమంది తన చెవుల్లో మార్మ్రోగిస్తున్నారు. దేవత లందరూ కలిసి దానవనృత్యం చేస్తున్నారు.

శవాన్ని తీసుకువెళ్ళేటప్పుడు వినిపించబడే సంగీతం చెవుల్లో ఘోష పెడుతోంది. వెయ్యి సముద్రాల హోరు మస్తిష్కంలో ద్విగుణీకతమవుతోంది.

ఆమె మస్తిష్కం వేగంగా చురుకుగా ఆలోచించింది. అందుకామె చాలా శ్రమ తీసుకోవాల్సి వచ్చింది.

గబగబా చీర విలిచి తాడులాగా పురితిప్పసాగింది. అప్రయత్నంగా పైకి చూసింది.

సీలింగ్‌ఫ్యాన్ నిశ్చలంగా వ్రేలాడుతోంది.

* * *

ఒక్కో మనిషి జీవితం ఒక్కోరకంగా వుంటుంది. ఒక్కో మనిషి కథ ఒక్కో ఒక్కో రకంగా ఉంటుంది. మార్పులు చెయ్యాల్సి వచ్చినా మలుపులు తిప్పాలనుకున్నా అది తాత్కాలికమే! ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోతుంది.

*